# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 13, మే 2026


### తీర్మాన ప్రతి సమర్పించడంలో ఆలస్యంపై

## సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ

**మంచిర్యాల బ్యూరో, మే 12, ప్రభాతవార్త**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి సంబంధించిన గ్రామపంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో జాప్యంపై చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల మల్లేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చి, మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలం సోమన్‌పల్లి గ్రామ పంచాయతీలో మంజూరు చేసి పాఠశాల నిర్మాణానికి తగినంత నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన గ్రామ పంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నట్లు గమనించడం జరిగిందని, ఈ విషయమై సరైన వివరణ కోరుతూ నోటీసు జారీ చేయడం జరిగిందని, సకాలంలో వివరణ అందించని పక్షంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 37(5) చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

✪ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కాగజ్‌నగర్ రూరల్, మే 12, ప్రభాతవార్త :**

జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం జంబుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. సంబంధిత రైస్ మిల్లర్లు జాప్యం లేకుండా దాన్యం దిగుమతి చేసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ధాన్యం కుప్పలను టార్పాలిన్ కవర్లను జాగ్రత్తగా గాలికి ఎగిరిపోకుండా కప్పి ఉంచాలని, ఎండ తీవ్రత దృష్ట్యా రైతులు ఆరోగ్య మిగతా 2లో..

### ప్రభుత్వ నిబంధనల ప్రకారం

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

✩ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**నస్పూర్, మే 12, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వర్ రావు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రభుత్వ నిర్దేశిత విధానాల ప్రకారం సజావుగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు, టార్పాలిన్లు, క్లీనింగ్ మెషీన్లు, ఇతర అవసరమైన పరికరాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హమాలీల సమస్యలు రాష్ట్రంలో ఎక్కడ తలెత్తకుండా గుత్తేదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహించిన పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలలో లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేయాలని, సమస్యలు ఉన్న కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద గ్రామ స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గోదాములు అందుబాటులో లేని ప్రాంతాలలో తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్ళ, కమ్యూనిటీ హాళ్ళ, రైతు బజార్లు వంటి ప్రదేశాల్లో ధాన్యాన్ని నిల్వ ఉంచే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. లారీలు అందుబాటులో లేని చోట ట్రాక్టర్లు, ఇతర రవాణా వాహనాలను వినియోగించి ధాన్యం రవాణా చేయాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ రైతులకు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రతికూల వార్తలు వెలువడిన సందర్భంలో వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ల పేరుతో మిగతా 2లో..





## రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో

### మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్..

**తాండూర్, మే 12, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోనీ మేదరవాడలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కా మహిళలు, కాలనీవాసులు రహదారిపై ఖాళీ బిందెలతో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ దాదాపు నెల రోజులు నుండి రోజు సక్రమంగా మంచినీరు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టు కున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న కార్యదర్శి దివాకర్ మేదరి వాడకు చేరుకొని రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. దీంతో మహిళలు, కాలనీవాసులు శాంతించి ఆందోళన విరమించారు.



### సింగరేణి కార్మికుల సమస్యలపై యాజమాన్యం

## సానుకూల నిర్ణయాలు

### ఏఐటీయూసీతో డైరెక్టర్ (పర్సనల్) చర్చలు సఫలం.. కీలక హామీల మంజూరు

**నస్పూర్, మే 12, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులతో డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు నిర్వహించిన సమావేశం విజయవంతమైంది. కార్మికులు ఎదుర్కొంటున్న సుదీర్ఘకాలపు పెండింగ్ సమస్యలపై చర్చించిన యాజమాన్యం, పలు కీలక అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశంలో మిగతా 2లో..





## యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేకుండా స్థానిక వాహనాలను వినియోగించుకోవాలని, ఇతర ప్రాంతాల హమాలీలపై ఆధారపడకుండా స్థానికంగా ఉన్న హమాలీలను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని 6వ వార్డులో ఇండ్ల గణన సర్వేను సబ్ కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. జనగణన 2027 లో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన ప్రక్రియను ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో వ్యవహరించి తమకు కేటాయించిన బ్లాక్ పరిధిలో ఇంటింటికి వెళ్లి పొరపాట్లకు తావు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, గణన ప్రక్రియలో పొందుపరిచిన 33 ప్రశ్నలకు సంబంధించి ఇండ్ల యజమానుల నుండి వివరాలు సేకరించి ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు జన గణన ఆధారపడి జరుగుతుందని తెలిపారు. జూన్ 9వ తేదీ వరకు కొనసాగనున్న ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధుకర్, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర సస్యరక్షణ
## పంటకు శ్రీరామరక్ష

**- శాస్త్రవేత్తలు లక్ష్మీనారాయణమ్మ, శిరీష**

**జన్నారం,మే12, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని దేవుని గూడ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు లక్ష్మీనారాయణమ్మ, శిరీష నువ్వు ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు పంటలలో చీడ పీడల నివారణకు కేవలం రసాయన మందుల మీద ఆధారపడకుండా సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని, భూసార పరీక్షలు విధిగా నిర్వహించుకోవాలని, పంట మార్పిడి విధానాన్ని పాటించాలని, యూరియా ను అవసరం మేరకే వాడాలని రైతులకు సూచించారు. అలాగే సమగ్ర ఎరువులు, నీటి యాజమాన్యాన్ని గురించి వివరించారు ఈ కార్యక్రమంలో దేవునిగూడ,కామన్ పెల్లి సర్పంచులు రాంటెంకి రాజేష్,పేరం శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి సయ్యద్ అక్రముల్లా, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఐకెపి సిసి సునీత దేవుని గూడ మరియు కామన్‌పెల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ నిబంధనల ప్రకారం
# కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే రిజాయిండర్లు విడుదల చేయాలని సూచించారు. వరిధాన్యం కొనుగోలు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల ద్వారానే జరగాలని, నేరుగా మిల్లులకు తరలించే చర్యలు చేపట్టవద్దని మిల్లర్లకు వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టోకెన్ వ్యవస్థ, రసీదు విధానం ప్రభుత్వ నిర్దేశిత విధానాల ప్రకారం అమలు చేయాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరా అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా ప్రతిరోజూ నివేదికలు పంపించాలని, క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ కొనుగోళ్లు సజావుగా కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోలు చేసిన వెంటనే కేటాయించిన ప్రకారంగా గోదాములు, రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లారీలతో పాటు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ప్రభుత్వ నిర్దేశిత విధానాలను అవలంబించాలని తెలిపారు. లారీలు, హమాలీ కొరత లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి కార్మికుల సమస్యలపై యాజమాన్యం
## సానుకూల నిర్ణయాలు

(మొదటిపేజీ తరువాయి)

కార్మిక హక్కుల పరిరక్షణకు సంబంధించి పలు హామీలను డైరెక్టర్ వెల్లడించారు. నెల రోజుల్లోపు మెడికల్ బోర్డును ఏర్పాటు చేస్తామని, ఆసుపత్రుల్లో ఆధార్ వివరాలు మారిన వారికి సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న 337 మంది డిపెండెంట్‌లకు ఉద్యోగాలు కల్పిస్తామని, అన్‌ఫిట్ అయిన మైనింగ్, ట్రేడ్స్ మెన్ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. మారుపేర్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రిటైర్డ్ కార్మికులకు నిలిపివేసిన లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లించేందుకు అంగీకరించారు. అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కట్టింగ్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఖాళీలు ఉన్నచోట మూడు సంవత్సరాల నిబంధనతో సంబంధం లేకుండా వెంటనే ట్రాన్స్‌ఫర్లు చేపడతామని, ఓవర్‌మన్‌లకు పెండింగ్ ప్రమోషన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ట్యాక్స్ సమస్యలను వచ్చే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి ఖరారు చేస్తామని, క్వార్టర్లు ఖాళీ చేసిన వెంటనే వెకేషన్ సర్టిఫికేట్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

**వీఆర్ఎస్ ఉండదు.. డైరెక్టర్ స్పష్టత:** సింగరేణిలో గోల్డెన్ హ్యాండ్‌షేక్ లేదా వీఆర్ఎస్ వంటి పథకాలను అమలు చేసే ఉద్దేశం యాజమాన్యానికి లేదని డైరెక్టర్ గౌతమ్ పొట్రు స్పష్టం చేశారు. అలాగే జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులకు పీనల్ వేజ్ కట్టింగ్‌ను నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను త్వరలో సీఎండీ స్థాయి సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

## హనుమాన్ భక్తులకు మజ్జిగ, పండ్ల పంపిణీ

**- వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లో సేవా కార్యక్రమాలు**

**నస్పూర్, మే 12, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నస్పూర్ మండలంలోని పలు హనుమాన్ దేవాలయాల వద్ద భక్తులకు, పాదచారులకు మజ్జిగ, అరటిపండ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పుట్కూరి నరేందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మంచిర్యాల జిల్లా వీఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లెతుల రాజేంద్రపాణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జయంతి వేడుకల కోసం ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు, పాదచారులకు చల్లని మజ్జిగ అందించి సేదతీర్చారు. సామాజిక సేవలో భాగంగానే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఫౌండేషన్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ శ్యామసుందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దండ రామకృష్ణ రెడ్డి, సభ్యులు రేగండ్ల ఉపేందర్, కమ్రుద్దీన్, శ్రవణ్, గోపతి తిరుపతి, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్**

**ఆసిఫాబాద్,మే 12, ప్రభాతవార్త :**



రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని సాండ్ గాం, వీరవెల్లి, దుబ్బగూడ, కుంబరి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. శ్రీ కనకదుర్గ, రాజరాజేశ్వరి, భాగ్యలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మి భార్గవి ఇండస్ట్రీస్, శ్రీ మహాలక్ష్మి గ్రూప్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, సి ఎం ఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు.

# ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



నర్సులను సన్మానిస్తున్న డాక్టర్ స్టేపి రాణి



**సారంగాపూర్, మే 12, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని సారంగాపూర్ హెల్త్ సెంటర్లో డాక్టర్ స్టేపి రాణి మండలంలోని సబ్ సెంటర్లలో పనిచేస్తున్న నర్సులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రుల్లో డాక్టర్ల తర్వాత రోగుల పర్యవేక్షణలో నర్సుల పాత్ర కీలకమని కొనియాడారు. ఎంతో ఓర్పుతో రోగులకు చికిత్స అందించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్ది ఇంటికి పంపే గుణం నర్సులకే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కృష్ణ మోహన్ గౌడ్, రాజేందర్, కిరణ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జైపూర్, మే 12, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ డిస్పెన్సరీలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీపిపి ఈడి చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొని నర్సింగ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈడి చిరంజీవి మాట్లాడుతూ ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు అధ్యక్షురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ (లేడీ విత్ ద లాంప్) జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా మే 12 న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. వైద్య రంగంలో ప్రాణాలను రక్షించే దేవ దూతలను గౌరవించుకునే రోజు అని అన్నారు. రోగులకు కేవలం మందులు ఇవ్వడమే కాకుండా, ప్రేమతో, ఓర్పుతో, నిస్వార్థ సేవను అందిస్తూ వారికి ధైర్యాన్ని నూరిపోసేది నర్సులు మాత్రమే అని కొనియాడారు. ముఖ్యంగా, కరోనా వంటి కష్టకాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి, కుటుంబాలను వదిలి, రోగుల కోలుకోవడం కోసం నిరంతరం శ్రమించిన నర్సుల సేవలు అపారమైనవని కీర్తించారు. నర్సులు వైద్యులకు కుడిభుజంగా ఉంటూ ఆరోగ్య వ్యవస్థను నడిపిస్తున్నారని అన్నారు. అనంతరం అధికారులు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, కాండిల్స్ వెలిగించి, కేకు కట్ చేశారు. నర్సింగ్ రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు సీనియర్ స్టాఫ్ నర్సు రాజమణి ఉత్తమ స్టాఫ్ నర్సుగా ఎంపిక చేసి ప్రశంస పత్రాన్ని అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి జిఎం నరసింహారావు, (పిసిఎస్ అండ్ ఓ అండ్ ఎం) జి.ఎం. మదన్మోహన్, ఏజిఎం (పి సి ఎస్) ఏ.జి.ఎం సూర్యనారాయణ రాజు, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతుల, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జానకి, ఎస్ఓటు ఈడి వెంకటయ్య, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, రిటైర్డ్ డా.ప్రభాకర్, ఇతర అధికారులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.




## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**బజార్హత్నూర్, మే 12, ప్రభాతవార్త:**

మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని, దీనివల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని సూచించారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గత వారం రోజులుగా నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 20 మందిని బోథ్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసును విచారించిన ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సందీప్ కుమార్ నిందితులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున మొత్తం 20,000 రూపాయల జరిమానా విధించారని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన మరో ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు వెల్లడించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



దీక్ష చేస్తున్న కౌన్సిలర్లకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

## ప్రభుత్వ ఐటీఐ అడ్మిషన్లు ప్రారంభం

**జన్నారం, మే 12, ప్రభాతవార్త**

2026 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బండి రాములు తెలిపారు. మంగళవారం రోజున ఆయన మాట్లాడుతూ.. ఎన్సీవీటీ విధానం కింద ఏటీసీ, ఐటీఐ ట్రేడుల్లో ప్రవేశాలకు మే 14 నుంచి జూన్ 8 వరకు వెబ్సైట్:https://iti.telangana. gov.in లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 10వ తరగతి లేదా 8వ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలని, 01082026 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఆన్లైన్ దరఖాస్తు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రింట్ కాపీని, రూ.100/ రిజిస్ట్రేషన్ ఫీజుతో సమీప ఏటీసీ లేదా ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

**లక్షెట్టిపేట, మే 12, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన పెట్టెం పద్మ అనే మహిళ జనవరి 24 తారీఖున తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడం జరిగింది. తను పోగొట్టుకున్న ఫోన్ ని వెతికి పెట్టాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు సిఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ వివరాలను పొందుపరచి దొంగిలించబడిన ఫోన్ ని స్వాధీనం చేసుకొని తిరిగి ఫిర్యాది కోరిక మేరకు పోలీస్ స్టేషన్లో తన కుటుంబ సభ్యులకు ఫోన్ అప్పగించడం జరిగింది.




ఫోన్ అందిస్తున్న ఎస్ఐ

## మొక్కజొన్న ఆన్లైన్: ఫలించిన సర్పంచ్ కృషి

**సారంగాపూర్, మే 12, ప్రభాతవార్త**

మండలంలోని జామ్ గ్రామంలో 700 ఎకరాల మొక్కజొన్న పంట వివరాలు ఆన్లైన్లో నమోదు కాకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమైంది. పంట వివరాలు నమోదు కాక రైతులు తమ దిగుబడిని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ కరిపె రవళి విలాస్ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ వెంటనే స్పందించి వ్యవసాయ అధికారులతో మాట్లాడటంతో పాటు బీజేపీ ఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే జిల్లా అధికారికి ప్రత్యేక లేఖ రాయడంతో వ్యవసాయ అధికారులు స్పందించి ప్రత్యేక పోర్టల్ ద్వారా రైతుల పేర్లను ఆన్లైన్లో నమోదు చేస్తామని తెలిపారు. మంగళవారం రైతులు తమ పేర్లను ఆన్లైన్లో నమోదు చేసుకున్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్కు రైతులు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ కృషి వల్లనే మొక్కజొన్న అమ్ముకునే అవకాశం కలిగిందని పేర్కొన్నారు.

## వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి: ఎస్పీ

**బజార్ హత్నూర్, మే 12, ప్రభాతవార్త**



"అరైవ్ ఆలైవ్" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రెండో విడత మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించేందుకు మొదటి విడతలో ఐదు మండలాల్లో 205 మందికి లైసెన్స్లు అందజేశామని తెలిపారు. రెండో విడతలో భాగంగా ఉట్నూర్, ఇంద్రవెల్లి, బజార్ హత్నూర్ మండలాల్లో మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మండలాల యువత తమ అడ్రస్ ప్రూఫ్ లేదా పదో తరగతి మెమో ప్రతులతో సంబంధిత పోలీస్ స్టేషన్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. లర్నింగ్ లైసెన్స్ కోసం 600 రూపాయలు, పర్మినెంట్ లైసెన్స్ కోసం 1200 రూపాయల ప్రభుత్వ రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈనెల 16 వరకు రిజిస్ట్రేషన్ గడువు ఉంటుందని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని ఎస్పీ తెలిపారు.

## ఎన్నిక జరిగే వరకు ఊరుకునేది లేదు: ఎమ్మెల్యే రామారావు పటేల్

**భైంసా, మే 12, ప్రభాతవార్త:**

భైంసా మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికను వాయిదా వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విమర్శించారు. మున్సిపల్ కార్యాలయం ముందు చైర్మన్ తుమ్మోల దత్తాత్రితో పాటు బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నిక జరుపుతామని కలెక్టర్ చెప్పినప్పటికీ, రాత్రివేళ వాట్సాప్లో వాయిదా సందేశం పంపడం సరికాదన్నారు. అధికారులు ఎంఐఎం పార్టీకి, ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నిక ఎందుకు వాయిదా వేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హైకోర్టుకు వెళ్తామని, అవసరమైతే అసెంబ్లీలోనూ గళమెత్తుతానన్నారు. ప్రజలు తమకు అధికారమిస్తే ఎంఐఎం కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఎన్నిక నిర్వహించే వరకు దీక్ష కొనసాగుతుందని, దీనికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ను సద్వినియోగం చేసుకోవాలి

**భైంసా, మే 12, ప్రభాతవార్త:**

భైంసా పట్టణ ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా మ్యాపింగ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శశి భూషణ్ తెలిపారు. 2002 నుండి 2025 మధ్య గల ఓటర్ల వివరాలను సరిచూసేందుకు ఈ నెల 13 నుండి 16 వరకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ తమ బీఎల్ఓలకు తగిన ఆధారాలు అందించి మ్యాపింగ్ చేయించుకోవాలని ఆయన కోరారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలింగ్ స్టేషన్ నెంబర్లు 117 నుండి 132 వరకు, మున్నూరు కాపు సంఘ భవనం వద్ద 114 నుండి 142 వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద 143 నుండి 150 వరకు, సరస్వతి శిశు మందిర్ వద్ద 151 నుండి 157 వరకు సంబంధించిన బీఎల్ఓలు అందుబాటులో ఉంటారు. సుభాష్ నగర్, గోపాల్ నగర్, బట్టిగల్లి, మదీనా కాలనీ, కిసాన్ గల్లీ వంటి వివిధ ప్రాంతాల ఓటర్లు తాము ఏ పోలింగ్ స్టేషన్లో నమోదయ్యారో ముందుగా సరిచూసుకుని, సంబంధిత బీఎల్ఓను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

## 20న ఆదిలాబాద్‌లో

# మెగా జాబ్ మేళా

**సిరికొండ, మే 12, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఇది ఒక సువర్ణావకాశమని సిరికొండ తహసిల్దార్ తుకారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 20న ఆదిలాబాద్ పట్టణంలోని మావాల చిల్కూరి గార్డెన్స్‌లో భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళా ద్వారా ప్రముఖ కంపెనీల్లో సుమారు 5000 ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా కనీసం 10,000 మంది నిరుద్యోగులు ఈ మేళాలో పేర్లు నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు వివరించారు. మండలంలోని అర్హులైన యువతీయువకులకు ఈ సమాచారాన్ని చేరవేసేందుకు గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హత కలిగిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో హాజరై ప్రయోజనం పొందాలని విజ్ఞప్తి చేశారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## భూ నిర్వాసితులకు

# పరిహారం అందజేత

**నేరడిగొండ, మే 12, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని రాజురా భూ నిర్వాసితులకు నష్టపరిహారం కింద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం చెక్కులను అందజేశారు. తొమ్మిది మంది బాధితులకు కలిపి మొత్తం రూ. 19,78,116 పరిహారాన్ని పంపిణీ చేశారు. బాధితుల్లో హాంజ బాయి చౌహన్ (రూ. 1,99,972), కనిరామ్ (రూ. 1,61,268), జాదవ్ ప్రేమ్సింగ్ (రూ. 1,09,662), రాథోడ్ జైత్రం (రూ. 2,58,029), రాథోడ్ దూద్రాం (రూ. 2,97,705), రాథోడ్ కలబాయి (రూ. 1,83,845), జాదవ్ లక్ష్మీ బాయి (రూ. 2,70,930), జాదవ్ నారాయణ (రూ. 2,29,000), రాథోడ్ దూద్రాం (రూ. 2,67,705) చొప్పున చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజన్, ప్రతాప్ పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే

# కఠిన చర్యలు

**సిరికొండ, మే 12, ప్రభాతవార్త:**

నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న ఇద్దరు డ్రైవర్లపై సిరికొండ ఎస్సై కేసులు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టగా.. కుంటాగూడకు చెందిన పేందూర్ ఇంద్రు తన బొలెరో వాహనంలో 50 మందిని, చింతగూడకు చెందిన కినక నాగోరావు తన వాహనంలో 30 మంది ప్రయాణికులను ప్రమాదకర రీతిలో తరలిస్తూ పట్టుబడ్డారు. సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఎస్సై హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న ఎస్సై



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

**ఆసిఫాబాద్ టౌన్, మే 12, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని కెస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శిరీష శర్మ, అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గణపతి పూజ, నవగ్రహ పూజలు నిర్వహించి అనంతరం హోమ కార్యక్రమం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవాలక్ష్మి తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

### రామనామ స్మరణతో మారుమ్రోగిన ఆలయాలు..

**జన్నారం, మే 12, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో ఆంజనేయ స్వామి దేవాలయంలో రామనామ స్మరణతో మారుమ్రోగాయి. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రోజు జన్నారం పట్టణంలోని అభయాంజనేయ సహిత మహాలక్ష్మి దేవాలయంలో ఆలయ అర్చకులు గుండి గణేష్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో హోమ యజ్ఞాలు నిర్వహించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, గ్రామంలో సుభిక్షం వెల్లివిరియాలని పూజలు చేశారు. హోమం అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి అన్న ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీ పాఠశాలలో చేతి పంపు ఏర్పాటు

**వేమనపల్లి, మే 12, ప్రభాతవార్త**



ముల్కలపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్యను సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్ పరిష్కరించారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన సర్పంచ్ కు పాఠశాలలో నీటి సమస్య ఉందని బోరు కూలిపోయి ఉందని ఉపాధ్యాయులు తెలపగా అట్టి బోరును మిషన్ బోరుతో కడిగించి మంగళవారం నూతన చేతి పంపు బిగించారు. దీంతో పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాగామ బాపు, వార్డు సభ్యులు ఆత్రం ముసలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కవ్వాల్‌లో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**జన్నారం, మే 12, ప్రభాతవార్త**



జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రోజు ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులతో ఇంటికో బోనంతో నెత్తిన ఎత్తుకొని డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. పంటలు చల్లగా ఉండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు.

**బోనాలలో పాల్గొని పూజలు చేసిన ఎమ్మెల్యే**

కవ్వాల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అన్నారు. అలాగే త్వరలోనే ఎల్లమ్మ ఆలయ ఆవరణలో బోర్ వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సర్పంచ్ సక్రు నాయక్, గుర్రం మోహన్ రెడ్డి, ఏనుగు సుభాష్ రెడ్డి, గౌడ సంఘం కుల పెద్దలు, కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అందరూ స్వచ్ఛందంగా జనగణనలో పాల్గొనాలి: ఎం.డి.ఓ సత్యనారాయణ

**జైపూర్, మే 12, ప్రభాతవార్త**



మండలంలోని ప్రజలు అందరూ స్వచ్ఛందంగా జనగణనలో పాల్గొనాలని మండల అభివృద్ధి అధికారి గుర్రం సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని ఇందారం, టేకుమట్ల, నర్సింగాపూర్, గంగిపల్లి గ్రామ పంచాయతీలలో ఎంపీఓ శ్రీపతి బాపు రావుతో కలిసి సందర్శించి గ్రామంలో నిర్వహిస్తున్న జనగణనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సత్యనారాయణ మాట్లాడుతూ జనగణనలో భాగంగా మొదటగా ఎన్యూమరేటర్లు గ్రామంలోని ప్రతి ఇంటిని గుర్తించి అందులో నివసిస్తున్న కుటుంబ సభ్యుల సంఖ్య ఇతర వివరాలు సేకరించి, ప్రతి ఇంటికి ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని, ఎక్కడ కూడా పేమెంట్ పెండింగ్ లేకుండా చూడాలని హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి లకు సూచించారు. ఈ పర్యటన లో ఇందారం సర్పంచ్ ఫయాజ్, ఉపసర్పంచ్ శివ వార్డు సభ్యులు, హౌసింగ్ ఏఈ కాంక్ష, పంచాయతీ కార్యదర్శులు ఎల్.ప్రశాంత్, ఆర్.శ్రావణి, ఎస్.సుప్రియ, ఏ .సత్యనారాయణ, జనగణన ఎన్యుమరేటర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**క్యాతన్‌పల్లి, మే 12, ప్రభాతవార్త**



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీషీట్ కలిగి ఉన్న వారు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని, వివాదాలు బెదిరింపులకు పాల్గొనరాదని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్ తొలగిస్తామని అన్నారు.

# అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న రౌట సంకేపల్లి

**ఆసిఫాబాద్, మే 12, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని రౌట సంకేపల్లి గ్రామం గత 8 నెలలుగా రాష్ట్ర గవర్నర్ మార్గదర్శకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు. మంగళవారం ప్రాజెక్టు అధికారి రౌట సంకేపల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందన్నారు. భూమి, త్రాగునీరు, రహదారులు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని అటవీ భూములపై హక్కులు కలిగి ఉన్న రైతులు మృతి చెందిన సందర్భాలలో వారి కుటుంబ సభ్యుల పేర్లకు ఆ పట్టాలను మ్యూటేషన్ చేసి వారసత్వ హక్కులు కల్పించాలని, సంవత్సరాలుగా ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న పేద, గిరిజన కుటుంబాలకు నిబంధనల ప్రకారం భూ పట్టాలు మంజూరు చేసి శాశ్వత హక్కులు కల్పించాలని, అటవీ భూములపై పట్టాలు ఉన్నప్పటికీ, అటవీ శాఖ అధికారుల ఆంక్షల వల్ల రైతులు వ్యవసాయ పనులు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు తమ భూములలో స్వేచ్ఛగా సాగు చేసుకునేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి రాకపోకలు సులభతరం చేయాలని, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను రాష్ట్ర గవర్నర్ గారు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని కొలం గూడ మల్టీపర్పస్ సెంటర్‌ను సందర్శించి సౌకర్యాలు, నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐటిడిఏ పిఓ అధికారి మంద మకరందు

## ఏబీ స్విచ్‌ల ఏర్పాటును వేగవంతం చేస్తున్నాం

**ఆసిఫాబాద్ టౌన్, మే 12, ప్రభాతవార్త :**



సర్కిల్ పరిధిలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపర్చేందుకు ఏబీ స్విచ్‌ల ఏర్పాటును వేగవంతం చేస్తున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలు, త్రిఫేజ్ లైన్లలో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడైనా లైన్ ఫాల్ట్ ఏర్పడితే మొత్తం గ్రామానికి విద్యుత్ నిలిపివేయకుండా, సమస్య ఉన్న ప్రాంతానికే పరిమితం చేయగలుగుతున్నామని వెల్లడించారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు, చెట్ల కొమ్మలు తగలడం వంటి కారణాలతో ఏర్పడే అంతరాయాలను త్వరగా గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతోందన్నారు. ఏబీ స్విచ్‌లతో ట్రిప్పింగ్ సమస్యలు తగ్గి, వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందుతోందని వివరించారు. మరమ్మతు పనుల సమయంలో సిబ్బంది భద్రత కూడా మెరుగుపడుతోందన్నారు. అత్యవసర విద్యుత్ సమస్యల కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించాలని సూచించారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

**కెరమెరి, మే 12, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో గత 25 రోజులుగా పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పెందోర్ శ్యాంరావు పటేల్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నిలో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. మొదటి విజేతగా కెరమెరి 11 జట్టు గెలిచింది. రన్నరఫ్‌గా సుల్తాన్ గూడ జట్టు నిలిచింది. ప్రథమ విజేతకు కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు రూ. 25000 నగదు బహుమతి అందించారు. రన్నరఫ్ గా నిలిచిన జట్టుకు ఉప సర్పంచ్ వాగ్మారే శ్రీకాంత్ రూ. 12500 నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి వ్యవస్థాపకులు పెందోర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, బీజేపీ మండల అధ్యక్షుడు సెడ్మకి తుకారాం, సర్పంచ్ కొద్దు, నాయకులు కోవ విజయ్, కుడ్మేత సోము, పెందోర్ వినేష్, రాజేష్, ధనోర ఉప సర్పంచ్ రిజ్వాన్ సయ్యద్, నిర్వహణ కమిటీ సభ్యులు వికార్ అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ నిషార్ అహ్మద్, యునుష్, క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్‌పై నేడు ప్రెస్‌మీట్

**మందమర్రి, మే 12, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలో నిర్వహించనున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రెస్ మీట్ నిర్వహించనుంది. ఈ పత్రికా సమావేశం మే 13వ తేదీ బుధవారం ఉదయం 10:30 గంటలకు జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరగనుంది. వచ్చే వారం మే 18వ తేదీ నుండి నిర్వహించబడనున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్ నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మీటింగ్ ద్వారా వివిధ విభాగాల మధ్య సమన్వయం పెంపొందించడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ప్రధాన లక్ష్యంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రెస్ మీట్‌లో జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో మీటింగ్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు, లక్ష్యాలు, అమలు విధానం తదితర అంశాలను మీడియా ప్రతినిధులకు సమగ్రంగా వివరించనున్నారు. అలాగే శాఖల మధ్య సమన్వయంతో చేపట్టే అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలపై కూడా వివరాలు వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ఈ సందర్భంగా మందమర్రి ఏరియాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరూ ఈ ప్రెస్ మీట్‌కు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగరేణి యాజమాన్యం కోరింది.



## సైకిల్ పోలో జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా జీవరత్నం

**లక్షెట్టిపేట, మే 12, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ మిషన్ కాంపౌండ్ కు చెందిన బండ జీవరత్నం సైకిల్ పోలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈనెల 10వ తేదీన నాగపూర్‌లో జరిగిన అన్యువల్ జనరల్ సమావేశంలో జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఎంపిక చేశారు. తను సైకిల్ పోలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా జరిగిన నూతన సమావేశంలో తను చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా బండ జీవరత్నం మాట్లాడుతూ... నాపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు నా సాయశక్తుల కృషి చేస్తానని, సైకిల్ పోలో ఆటల పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీసుకెళ్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపిక అయిన బండ జీవరత్నంను స్థానిక సీఎస్ఐ ప్రెస్ బీటర్ ఇంచార్జ్ డేవిడ్ పాల్, స్థానిక కమిటీ సభ్యులు అద్దంకి బాలశౌరి, సుజిత, సుమన్ చక్రవర్తి, విజయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదు: సీఎం రేవంత్ రెడ్డి

**నిర్మల్, మే 12, ప్రభాతవార్త:**

వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మల్ కలెక్టరేట్ నుండి కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, హమాలీలు, గన్ని సంచులు, వాహనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం తూకం, తరలింపులో రైతుల నుండి డబ్బులు వసూలు చేయరాదని, సేకరించిన వెంటనే రశీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో కొనుగోళ్లు సాఫీగా సాగేలా చూడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

**నార్నూర్, మే 12, ప్రభాతవార్త:**



టెంట్ తొలగిస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం నార్నూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాలేపూర్ గ్రామానికి చెందిన భాగ్యవంత్ నిఖిల్ (28) ఓ కార్యక్రమానికి వేసిన టెంట్ తొలగిస్తున్నాడు. ఆ సమయంలో ఒక్కసారిగా గాలి వీయడంతో టెంట్ ఎగిరిపోకుండా ఉండేందుకు నిఖిల్ దాని స్తంభాన్ని పట్టుకున్నాడు. అయితే ఆ స్తంభం పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్ఓ గణపతి తెలిపారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**చింతలమానేపల్లి, మే 12, ప్రభాత వార్త:**

మండలంలోని బాబాసాగర్ గ్రాణంలో గల పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి జయరాజ్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరంలో విద్యార్థులకు యోగా, డ్యాన్స్, కరాటే, ఆటలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సెలవుల్లో ఇటువంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, పాఠశాల కమిటీ చెర్మన్ కమల, పంచాయతీ కార్యదర్శి శంకర్, ఉపాధ్యాయులు రమేష్, చంద్రయ్య, మనీషా, అనీల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు




మాట్లాడుతున్న ఎంఈఓ వాసాల ప్రభాకర్

## ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**- మండల విద్యాధికారి వాసాల ప్రభాకార్**

**- 10వ తరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభం**

**కాగజ్‌నగర్ రూరల్ ,మే 12, ప్రభాతవార్త :**

10వ తరగతి ఫెయిల్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకార్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) కాగజ్‌నగర్‌లో ఇటీవల పదో తరగతిలో అనుత్తీర్ణులైన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమం ఈరోజు నుంచి జూన్ 3వ తేదీ వరకు కొనసాగనున్నట్లు కోర్సు కోఆర్డినేటర్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడీ దేవాజీ తెలిపారు. శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు అందిస్తున్న మార్గదర్శకత్వాన్ని వినియోగించుకుని అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), కౌటాల మండలాలకు చెందిన విద్యార్థుల కోసం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు హాజరై శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. విద్యార్థులు తిరిగి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక బోధన, సందేహ నివృత్తి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాస్పల్లి పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎ. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు దామోదర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడతాం

**- ముంజం ఆనంద్ కుమార్**

**కాగజ్‌నగర్ రూరల్,మే 12, ప్రభాతవార్త :**

మండలంలోని బురదగూడ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 15వ తేదీన ఉపాధి హామీ మరియు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 20వ తేదీన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే భారీ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పని ప్రదేశాలలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలకు న్యాయమైన వేతనాలు చెల్లించడంతో పాటు పనిదినాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బురదగూడ గ్రామంలో నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొర్కుట్ రాజేందర్, పోశెట్టి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి





**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**కాగజ్‌నగర్, మే 12, ప్రభాతవార్త :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించిన మండలాల తహసిల్దార్లు, ఎ పి ఎం లు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ సమర్థవంతంగా చేపట్టాలని, జిల్లాలో మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు బూత్ స్థాయి అధికారులకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని తెలిపారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు, గోనె సంచుల లభ్యత, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల జారీ, పెండింగ్ అంశాలపై తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ దృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా గోదాముల్లో నిల్వ

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల బ్యూరో, మే 12, ప్రభాతవార్త**



అకాల వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములను నిల్వ చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల మార్కెట్ యార్డు గోదామును జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, ఉపతహసిల్దార్ సనత్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండలం ఆస్నాద్, ఒత్కులపల్లె గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కోటపల్లి మండలం దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర లతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చినట్లయితే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనపై బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుల కఠిన చర్యలు

**- నార్కోటిక్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన నలుగురిపై కేసులు నమోదు**

**- డిఅడిక్షన్ సెంటర్‌కు తరలింపు**

**బెల్లంపల్లి, మే 12, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలనపై బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి రవాణా, నిల్వ, సరఫరా వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో గంజాయి రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులను వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహించారు. యూరిన్ టెస్ట్‌లో నలుగురు వ్యక్తులు పాజిటివ్‌గా తేలినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు వారికి 15 రోజులపాటు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందించాలని నిర్ణయించారు.

పాజిటివ్‌గా తేలిన వారి వివరాలు:

ఎస్కే జమీర్ (26), చేపల వ్యాపారి, బెల్లంపల్లి బస్తీ, ఆర్. ఎమ్‌డీ తాజ్ బాబా (20), కూలీ, వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతం, ఎస్కే కలీం (30), కూరగాయల వ్యాపారి, వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతం, తోట మనీదీప్ (21), డ్రైవర్, 65 డిప్ ప్రాంతం.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. మత్తుకు బానిసైన వారిని సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి కౌన్సిలింగ్, వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలపై అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



# బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా వారోత్సవాల్లో యోగా

**- విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం, పీజీ ఎంట్రెన్స్ పై అవగాహన**

**బెల్లంపల్లి, మే 12, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వారం రోజుల పాటు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమం రెండో రోజు భాగంగా కళాశాల వరండాలో ప్రిన్సిపాల్, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కలిసి వివిధ యోగాసనాలు నిర్వహించారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొంటూ, ప్రతి రోజు ప్రాణాయామం వంటి సాధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. పీజీ ఎంట్రెన్స్‌పై అవగాహన కార్యక్రమం యోగా కార్యక్రమం అనంతరం, విద్యా వారోత్సవాల్లో భాగంగా డిగ్రీ విద్యార్థులకు పీజీ ఎంట్రన్స్ పరీక్షలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ ఆసక్తి, ప్రతిభ, సబ్జెక్ట్‌పై ఉన్న పట్టు ఆధారంగా పీజీ కోర్సును ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**బెల్లంపల్లి, మే 12, ప్రభాతవార్త**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో గ్రామస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం రోజున బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీలో డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్, మండల తహసిల్దార్ కృష్ణ, ఎంపీడీఓ మహేందర్‌లతో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో మంజూరు అయిన ఇళ్ల నిర్మాణాన్ని జూన్ 2వ తేదీ లోపు పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కూడా పరిశీలించి, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను సందర్శించి, పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వేదాల శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, సర్పంచ్ మల్లమ్మ, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

**పశువుల అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి - అంతర్ జిల్లా చెక్ పోస్ట్ తనిఖీ చేసిన డీసీపీ**

**తాండూర్, మే 12, ప్రభాతవార్త :**



అంతర్ జిల్లా చెక్ పోస్టు గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయాలని మంచిర్యాల డిసిపి భాస్కర్ అన్నారు. తాండూర్ మండలంలోని రేపల్లెవాడ సమీపంలో గల అంతర్ జిల్లా చెక్ పోస్టును సోమవారం అర్ధరాత్రి డిసిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి వాహన వివరాలు రిజిస్టార్ లో నమోదు చేయాలనీ సూచించారు.పశువుల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, పశువుల అక్రమ రవాణా జరిగితే స్థానిక పోలీసులకు, 100కు కాల్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి డీసీపీ పలు సూచనలు చేశారు. డీసీపీ వెంట తాండూర్, బెల్లంపల్లి 1 టౌన్ సీఐలు దేవయ్య, శ్రీనివాస్ రావు, తాండూర్ ఎస్సై ప్రసాద్ ఉన్నారు.




# బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలి: డీసీపీ ఏ. భాస్కర్

**- సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ.. రికార్డుల తనిఖీ**

**నస్పూర్, మే 12, ప్రభాతవార్త**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వారికి సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల జోన్ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, రౌడీ షీటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. అంతకుముందు స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి అధికారులు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిరంతరం నిర్వహిస్తూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని డీసీపీ సూచించారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకం కావాలని, శాంతిభద్రతల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచి రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని డీసీపీ స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్, ఎస్ఐ ఎం. ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో ఆదర్శప్రాయంగా ఉచిత పీజీ కోచింగ్, యోగా

**లక్షెట్టిపేట, మే 12, ప్రభాతవార్త**



తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా లక్షెట్టిపేట ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న విద్యా వారోత్సవాల్లో రెండవ రోజు మంగళవారం ఉచిత పీజీ కోచింగ్, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. లక్షెట్టిపేట, మంచిర్యాల, చెన్నూరు, కాగజ్ నగర్, మహిళా జగిత్యాల కళాశాల, తెలుగు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉచిత ఎం.ఏ తెలుగు ఎంట్రన్స్ కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చదువు వల్లనే ఉన్నత స్థాయిలో స్థిరపడుతామని కాబట్టి ఉన్నత విద్య కోసం ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. కోచింగ్ ద్వారా ప్రామాణికమైన పుస్తకాల జ్ఞానం, నాణ్యమైన బోధన లభిస్తుందని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అంతర్జాల కోచింగ్ ఉచితంగా రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమని తెలిపారు. కాగా మంచిర్యాల ప్రిన్సిపాల్ డా. జైకిసాన్ ఓజా, లక్షెట్టిపేట కళాశాల ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ మాట్లాడుతూ... ఈ కోచింగ్ కి డా. తన్నీరు సురేష్, డా. శ్రీధర హరీష్, డా. గోలి శ్రీలత, డా. లక్ష్మీ నరసింహం, డా. పట్వర్ధన్ సారథ్యం వహిస్తున్నారని, తెలంగాణలో ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న, సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులు కోచింగ్ లో పాఠాలు బోధిస్తారని విద్యార్థులు తమ అనుమానాలు సులభంగా నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కోచింగ్ 30 రోజుల పాటు ప్రతిరోజు అంతర్జాలం ద్వారా జరుగుతుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలోని ఏ ప్రాంతం విద్యార్థి అయినా సులభముగా ఈ సేవలను వినియోగించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. సమన్వయకర్త తన్నీరు సురేష్ మాట్లాడుతూ... గూగుల్ ఫామ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ అధ్యక్షతలో విద్యా వారోత్సవాల్లో భాగంగా యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కామర్స్ అధ్యాపకులు జాడి శంకరయ్య యోగా మాస్టర్ గా వ్యవహరిస్తూ యోగా ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగాసనాలు వేస్తూ ఆయా ఆసనాల వలన కలిగే ఆరోగ్య లాభాలను పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ మాట్లాడుతూ.. యోగా వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని శరీరం ఉత్తేజాన్ని పొంది, నూతన ఉత్సాహం లభిస్తుందని తెలిపారు. యోగా మన వారసత్వ సంపద అని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది ప్రముఖ యోగాసనాలు వేసి యోగా పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.